గణతంత్ర వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర- విజయ నగరం: గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. ప్రణాళికాయుతంగా వ్యవహరించి గతంకంటే మెరుగ్గా నిర్వహించాలని సంబంధిత ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేసుకోవాలని సూచించారు. జనవరి 26న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై ఆమె బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేడుకల నిర్వహణలో ఎలాంటి సమన్వయ లోపం తలెత్తకుండా అందరూ ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని, అందరూ పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఆయా విభాగాల నుంచి నిర్వహించే కార్యక్ర మాల జాబితాలను, శకటాల ప్రదర్శనలకు సంబంధించిన వివరాలను నిర్వాహకులకు అందజేయాలని సూచించారు. అన్ని వర్గాల, అన్ని రంగాల విజయాలను ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి నాటిక ప్రదర్శలు ఏర్పాటుచేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో ఎం. గణపతిరావు, విజయనగరం ఆర్డీవో సూర్యకళ, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్ లో విశాఖ సంస్కృతి సంక్రాంతి సంచిక ఆవిష్కరణ

విశాలాంధ్ర -విజయ నగరం టౌన్ గాజులరేగ లోని సీతం కళాశాల లో విశాఖ సంస్కృతి సంక్రాంతి సంచిక ను కళా శాల డైరెక్టర్ డా. మజ్జి శశి భూషణరావు విద్యార్థులతో కలసి ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థులు విశాఖ సంస్కృతి మాసపత్రిక ముఖ చిత్రం గా చాలా ఆనందం గా ఉంది అని,మన కట్టు, బొట్టు ప్రత్యేక మైనవని, భారతీయులు ప్రపంచం లో ఏ మూలాన ఉన్నా గుర్తు పట్టవచ్చని, మన సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందివ్వాలి అని,ఆ దిశగా కృషి చేస్తున్న విశాఖ సంస్కృతి పత్రిక కి అభినందనలు తెలిపారు .సీతం కళాశాల లో విద్య తో పాటు మన సంస్కృతి ని ప్రతబింబించే కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్న కళాశాల డైరెక్టర్‌కి విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేసారు.

ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీఓ రామకృష్ణ సమీక్ష

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో బుధ వారం మండల పరిషత్ కార్యాల యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షను నిర్వహించిన ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ. ఈ సమీక్షలో ప్రధానముగా డిమాండు కల్పన, జియోటాగింగ్, ఆధార్ వెరిఫికేషన్ గూర్చి పలు సూచనలు ఇచ్చారు. రానున్న కాలానికి పని పుస్తకం వున్న ప్రతీ ఒక్కరికీ డిమాండును కల్పించాలని, బోన్ యాప్ నందు ప్రస్తుతం, ముందు మరియు తరువాత చేయాల్సిన వాటికి జియో టాగింగ్ చేయాలని, గతకాలంలో పనిచేసి మరణించిన వారి పేరులను సత్వరమే తొలగించాలని ఎంపీడీఓ సూచించారు.

పండగ పూటా పస్తులే....!

విశాలాంధ్ర-దత్తిరాజేరు : రాష్ట్ర చరిత్రలో వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం లాంటి అసమర్థ ప్రభుత్వ మరొకటి లేదని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో అన్నారు. రాష్ట్ర ప్రజలు సంక్రాంతి లాంటి మహా పండుగను ఆనందంగా జరుపుకునే పరిస్థితి లేదని గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సంక్రాంతి కానుకలు పేరుతో పేద ప్రజలకు పండగ పూట పస్తులు లేకుండా వివిధ రకాల నిత్యావసర వస్తువులు అందించి పేదవారి కళ్ళల్లో ఆనందాన్ని నింపేవారు. కానుకలు లేవు సరి కదా సుదూర ప్రాంతాల నుండి కనీస రవాణా సౌకర్యం కూడా కల్పించలేని అసమర్థ ప్రభుత్వం అన్నారు ఆధునిక టెక్నాలజీ శరవేగంగా విస్తరిస్తున్న ఈ సమయంలో కూడా ప్రజలు తిరిగి ప్రయాణం అవ్వడానికి రోడ్లమీద పడి కాపులు పడటం చాలా బాధాకరమని, నిత్యవసర వస్తువులు ధరలు గ్యాస్, వంట నూనె ధరలు విపరీతంగా పెరిగిపోవడం, రైతులు పండించే ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనలేకపోవడం సకాలానికి డబ్బులు రాకపోవడం ప్రజల్లో పండగ ఆనందం లేదన్నారు.

ఎన్టీఆర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

టీడీపీ మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

విశాలాంధ్ర-బొబ్బిలి: బొబ్బిలిలో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి తెలుగువారి హృదయాల్లో చిరస్తాయిగా నిలిచిన డాక్టర్ నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి కార్యక్రమాన్ని తెలుగుదేశం శ్రేణులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజయ్ కృష్ణ రంగారావు హాజరయ్యారు. బొబ్బిలి కోట నుంచి ర్యాలీగా తరలివెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు విలేకరులతో మాట్లాడారు. స్వర్గీయ ఏన్.టి.ఆర్ ఆశయాలు అందరికి స్ఫూర్తి దాయకమని అన్నారు. పేదలకు అండగా నిలిచి బలహీన వర్గాల అభ్యున్నతికి తనదైన శైలిలో కృషిచేసిన మహోన్నత నేత ఎన్.టి.ఆర్ అని తెలిపారు. అదే ఒరవడిలో చంద్రబాబు పాలన చేపట్టారని అన్నారు. ప్రస్తుతం జగన్మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని ఎద్దేవా చేశారు. జి.వో నెంబర్ ఒన్ ఇందుకు సాక్షామని అన్నారు. వర్ధంతి కార్యక్రమంలో పెద్దఎత్తున టిడిపి కార్యకర్తాలు నేతలు పాల్గొన్నారు.

తెలుగుజాతి కీర్తి కిరీటం ఎన్టీఆర్ : కోళ్ల

శృంగవరపుకోట : తెలుగుజాతి కీర్తి కిరీటం స్వర్గీయ నందమూరి తారకరామారావు అని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శృంగవరపుకోట పట్టనంలోని దేవి కూడలి వద్ద విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె విలేక రులతో మాట్లాడుతూ తెలుగు భాష, సినిమా, కళలు, రాజకీయాలు, సాహిత్య రంగాల వికాసానికి ఎనలేని కృషిచేసిన మహానాయకులు ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు మనందరం కలిసికట్టుగా కృషిచేద్దామని ఆమె అన్నారు. కార్యక్రమంలో శృంగవరపుకోట మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమనాజి, శృంగవరపుకోట గ్రామ పార్టీ అధ్యక్షులు కె.మల్లీశ్వరరావు, విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాపుగంటి శ్రీనివాసు, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కిరణ్‌కుమార్, ఐటీడీపీ నియోజకవర్గం కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, బీసీ సెల్ ఉపాధక్షులు కనిశెట్టి ఈశ్వరావు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు వాకాడ బాలు, అనిల్, పుణ్యగిరి మాజీ ఎంపీటీసీ కన్నతల్లి, ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసి, టీడీపీ సీనియర్ నాయకులు వసంత సత్యారావు, మోపాడ చిన్ని కృష్ణ, పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), సరిపల్లి రామకృష్ణ, పెదగాడ రాజు, తదితరులు పాల్గొన్నారు.



దెంకాడ: టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా దెంకాడ మండలం అక్కివరం చింతలవలస గ్రామంలో బుధవారం దెంకాడ మండలం టీడీపీ ఆద్వర్యంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు అధ్యక్షతన ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు. అనంతరం దెంకాడ మండలం పినతాడివాడలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు, అసుపత్రి సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దెంకాడ మండలం మాజీ ఎంపీపీ కంది చంద్ర శేఖర్ రావు దెంకాడ మండలం మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ దెంకాడ మండలం టీడీపీ అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు మాజీ ఏఎంసి వైస్ ఛైర్మన్ కాగితాల సత్యనారాయణ రెడ్డి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు దెంకాడ మండలం టీడీపీ ఉపాధ్యక్షులు పడాల చిన్నారావు, స్థానిక నాయకులు పిన్నింటి రమేష్ నాయుడు ఉప సర్పంచ్ చీకటి సుహాసిని మాజీ సర్పంచ్ సవరవిల్లి సత్యవతి పాలు శ్రీను తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేపాడ : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక స్వర్గీయ నందమూరి తారక రామారావు అని శరంగవరపుకోట నియోజకవర్గ టిడిపి యువనేత గొంప కృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వేపాడలో మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో పాల్గొని ఎన్టీఆర్ కీర్తిని కొనియాడారు. ముందుగా వేపాడ వల్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఎస్ కోట పార్లమెంటరీ అధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు గొర్లె నాగరాజు, సిరికి రమణ, పార్టీ కార్యకర్తలు, ఐటీడీపీ, టి.ఎన్.ఎస్.ఎఫ్, టి.ఎన్.టి.యు,సీ తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు రైతు, ఎన్.టి.ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

జామి: మండలంలో దివంగత ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 27వ వర్ధంతిని స్థానిక పార్టీ నేతలు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వ హించారు. జామిలోని బజార్ సెంటర్‌లో పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, ప్రధానకార్యదర్శి వర్రి రమణతోపాటు జెడ్‌పిటిసి బందారుపెదబాబు, రెడ్డి పైడిబాబు తదితరుల ఆద్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలను ఎన్నటికీ మరువలేమన్నారు. కానీ నేడు వైసీపీ వంటి రాజ్యాంగేతర శక్తులు రాష్ట్ర ప్రజలను పూర్తిగా నట్టేట ముంచుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో గజపతినగరం నియోజకవర్గం పరిదిలోని జామి మండల పార్టీ అధ్యక్షుడు పి. స్వామినాయుడు, ప్రధాన కార్యదర్శి దనియాల పైడిరాజు, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి కొత్తలి సూర్యారావు, ముకుంద శ్రీను, తెలుగుయువత అధ్యక్షుడు రాయ వరపు శంకరరావు, నియోజకవర్గ నేత బండారు జగన్నాధం, విశాఖ పార్లమెంటరీ మహిళా కార్యదర్శి ఇప్పాక వెంకట త్రివేణి, స్థానిక నేతలు వి.ఎ.నాయుడు బాబు, గొర్లె శ్రీను పాల్గొన్నారు.

గజపతినగరం: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గజపతినగరంలోని ప్రధాన రహదారి సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తి కిరీటం తెలుగుదేశం పార్టీ స్థాపించి పేద ప్రజలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ఘనత ఆయనదేనని అన్నారు. ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రానికి అధోగతి పట్టిందని గజపతినగరం రోడ్లు పరిస్థితి చూస్తుంటే అది అర్థమవుతుందని అన్నారు. అనంతరం 300 మంది పేద ప్రజలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లెంక చిన్నం నాయుడు సత్యనారాయణ, మిత్తి రెడ్డి వెంకటరమణ, గోవిందరావు, కర్రి ఆదినారాయణ, సత్యనా రాయణ, రంబ చంద్రశేఖర్, సారిక శంకర్ పాల్గొన్నారు.

పూసపాటిరేగ : పూసపాటిరేగలో నందమూరి తారక రామారావు విగ్రహానికి మండల టిడిపి నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మండల పార్టీ శ్రేణులు మాట్లాడుతూ నందమూరి పరిపాలన ఆంధ్రప్రదేశ్ స్వర్ణయగమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహంతి చిన్నం నాయుడు మండల పార్టీ అధ్యక్షుడు మహంతి శంకర్రావు మాజీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తమ్మీ నాయుడు, కనిమెల్ల మాజీ ఎంపీటీసీ దూరగాసి సూర్యారావు, రెల్లివలస.ఇజ్జు రౌతు ఈశ్వరరావు గోవిందపురం ఎక్స్ సర్పంచ విక్రం జగన్నాథ,నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ నాయకులు మహంతి కిశోర్,మాజీ సర్పంచ్ బొంతు రవి పాల్గొన్నారు.

భోగాపురం: దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండలం పోలిపల్లి గ్రామం లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగారు రాజు, భోగాపురం మండలం టిడిపి అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ సమక్షంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మండలం సుందర పేట గ్రామంలో గల పీహెచ్‌సీలో లో రోగులకు, పేదవారికి, పులిహోర, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భోగపురం టిడిపి సీనియర్ నాయకులు నీలాపు అప్పల రామిరెడ్డి, కోరాడ తాతారావు, భోగాపురం క్లస్టర్ ఇన్చార్జి తోటరావు పాల్గొన్నారు.

20 లీటర్ల నాటుసారాతో ముగ్గురు అరెస్ట్

విశాలాంధ్ర -బొబ్బిలి: స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఆర్. జైభీమ్, ఆధ్వర్యంలో బుధవారం రామభద్రపురం మండలం జోగిందోరవలస గ్రామానికి చెందిన కురిడి సోములు, కురుడి ఆదన్న దొర, పెదకాపు చిన్నారావు అను వ్యక్తులు 20 లీటర్లు నాటుసారా రవాణా చేస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఎవరైనా నాటుసారా విక్రయిస్తే 9440902372 కు సమాచారం ఇవ్వవలసినదిగా కోరారు. ఈ దాడుల్లో ఎస్.ఐ. చిన్నం నాయుడు, సిబ్బంది చంద్ర ప్రసాద్, ఆదినారాయణ, సరస్వతి లు పాల్గొన్నారు.

హత్యా ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు



విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో వెలగవలస గ్రామ మామిడి తోటలో ఇటీవల జరిగిన హత్యాఘటనా స్థలానికి జిల్లా ఎస్పీ దీక్షిత తన సిబ్బందితో కలసి బుదవారం చేరుకుని హత్య జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించారు. తనతో పాటు అర్ ఎస్ ఎల్ సెంట్రల్ ల్యాబ్ టీమ్ హాజరు అయ్యి ఆ పరిసర ప్రాంతాల్లో యంత్రాలతో పరిశీలించారు. తనతో పాటు బొబ్బిలి సిఐ తిరుమల రావు, తెర్లాం ఎస్ఐ రమేష్ నాయుడు,బాడంగి ఎస్ఐ ఆర్.జయంతి వీరికి సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని, హత్య జరిగిన ప్రదేశం కు సుమారు 200 మీటర్లు వరకు గాలింపు చేసి ఆధారాలు కోసం పరిశీలించాలని వారికి తెలిపారు. అనంతరం సిఐ తిరుమల రావు ఎస్పీ తో మాట్లాడుతూ సుమారు మృతదేహం తల వెనక భాగాన, బుజాల పైన, వీపు పైన 17 బలమైన కత్తి పోట్లున్నాయని ఎస్పీ కు తెలిపారు. అనంతరం ఎస్పీ స్టేషన్ లో భద్రపరిచిన దుస్తులను పరిశీలించారు.ఎస్పీ మాట్లా డుతూ ఈ పరిసర ప్రాంతాల ఇరువైపులా జల్లెడ పట్టి వివరాలు కనిపిస్తే సేకరించాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ కొత్త యంత్రాలు వచ్చాయని అర్ఎస్ ఎల్ సెంట్రల్ ల్యాబ్ ద్వారా పరిశీలి స్తున్నామని, వివరాలు వచ్చిన వెంటనే తెలుపుతామని ఎస్పీ తెలిపారు. ఈ దర్యాప్తులో తనతో పాటు కింద స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో రాజాం-పాలకొండ రోడ్డు విస్తరణ పనులు

శంకుస్థాపన చేసిన మంత్రి బొత్స

విశాలాంధ్ర-రాజాం: రోడ్లుభవనాల శాఖ ఆధ్వర్యంలో రాజాం పట్టణంలో విజయనగరం-పాలకొండ రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 కోట్లకు అదనంగా మరో రూ.10 కోట్లు కట్టడాలు, భవనాలకు నష్టపరిహారం చెల్లింపు, తాగునీటి పైపులైన్ల మార్పిడి, విద్యుత్ స్థంభాలు, లైన్ల మార్పిడి చేసేందుకు అవసరమని గుర్తించామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఈ మేరకు అవసరమైన నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులతో సంప్రదించి, వారితో సమన్వయంతో పనిచేయడం ద్వారా రోడ్ల విస్తరణ పనులను సకాలంలో పూర్తిచేసేందుకు అధికారులు కృషిచేయాలని మంత్రి ఆదేశించారు. విజయనగరం జిల్లా రాజాం పట్టణంలో ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో చేపట్టనున్న నాలుగు కిలోమీటర్ల రోడ్ల విస్తరణ పనులకు మంత్రి బుధవారం రాజాం పట్టణంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ కూడలి వద్ద శంకుస్తాపన చేశారు. అనంతరం స్థానిక సూర్యదుర్గ కళ్యాణ మండపంలో ప్రజాప్రతినిదులు, జిల్లా అధికారులతో రోడ్డువిస్తరణ పనులపై సమీక్ష నిర్వహించారు. రోడ్డు విస్తరణలో భవనాలు, కట్టదాలు కోల్పోయిన వారికి రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సి వుంటుందని, ఇళ్ళు, భవనాలు కోల్పోతున్న వారు పరిహారం నగదురూపంలో చెల్లించాలని కోరుకుంటున్నారని పట్టణ ప్రణాళిక అధికారి మంత్రికి వివరించారు. ప్రభుత్వం ద్వారా పరిహారం నగదు రూపంలో చెల్లింపులకు అవకాశం వుంటే పరిశీలిస్తామని, లేనిచో టి.డి.ఆర్. బాండ్లు జారీచేసి అనంతరం వాటిని నగదుగా మార్చుకొనే అవకాశం కల్పిస్తామన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ.2.6 కోట్ల మేరకు విద్యుత్ స్థంభాలు, లైన్ల మార్పిడికి అవసరం వుంటుందని అంచనాలు రూపొందించినట్లు విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు వివరించారు. గ్రామీణ నీటిసరఫరా విభాగం ఆధ్వర్యంలో పైప్‌లైన్ల మార్పిడి కోసం రూ.3 కోట్లు అవసరం వుంటుందని ఆ శాఖ ఎస్.ఇ. ఉమాశంకర్ వివరించారు. ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖకు చెందిన తాగునీటి డిస్ట్రిబ్యూషన్ మెయిన్ల మార్పుకోసం మరో రూ.3.20 కోట్లు అవసరం వుంటుందని అంచనాలు రూపొందించినట్లు ఆ శాఖ డి.ఇ. తెలిపారు. రోడ్లు విస్తరణ పనుల్లో భాగంగా రెండు కిలోమీటర్ల మేరకు డ్రెయిన్ల నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి ఆటంకాలు లేనందువల్ల ముందుగా డ్రెయిన్ల పనులు ప్రారంభించాలని రోడ్లు భవనాల శాఖ ఇ.ఇ. రమణను మంత్రి ఆదేశించారు. రాజాం నుంచి పాలకొండ రోడ్డును కూడా రూ.15 కోట్లతో పటిష్టం చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించామని త్వరలో ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు. రాజాం ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో సహకరిస్తామన్నారు. సమావేశంలో జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ సూర్యకుమారి, ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎం.ఎల్.సి. పాలవలస విక్రాంత్, శ్రీకాకుళం జెడ్పీ వైస్ ఛైర్మన్ సిరిపురపు జగన్మోహన్, కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేడాడ తిలక్, ఆర్.డి.ఓ. అప్పారావు, గ్రామీణ నీటిసరఫరా ఎస్.ఇ. ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వాహనం ధ్వంసం

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం జిల్లా కేంద్రంలో జగనన్న ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ వ్యాన్ ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మున్సిపాలిటీలోని 18వ వార్డు బంగారమ్మ కాలనీకి చెందిన రేషన్ సరుకుల పంపిణీ వ్యాన్ అద్దాలను గుర్తు తెలియని దుండగులు మంగళవారం అర్ధరాత్రి పగలగొట్టారు. ఈ ఘటనపై ఆపరేటర్ ప్రసాద్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రేషన్ సరుకుల పంపిణీ వ్యాన్ ధ్వంసం చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు జాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్

మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: తెలుగు జాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బొబ్బిలి చిరంజీవులు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలను అమలుచేసే ఘనత ఎన్టీఆర్ కి దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, పట్టణ మండల పార్టీల అధ్యక్షులు జి రవికుమార్, డి మోహన్ రావు, కౌన్సిలర్లు బడే గౌర్నాయుడు, తాతపూడి వెంకట రామమూర్తి, కోలా మధుసూదన్ రావు , సీనియర్ నాయకులు జి వెంకట నాయుడు, కే వెంకట్రావు, జి ఉదయభాను జె రవిశంకర్, జె ధనంజయ నాయుడు, పి రాజశేఖర్, ప్రదీప్, కార్తీక్, లక్ష్మణరావు, బి రవికుమార్, జి రామ్మూర్తి, ఏరామకృష్ణ తోపాటు నియోజవర్గంలో ఉన్న నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కృష్ణపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ బొబ్బిలి చిరంజీవులు ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏం చైర్మన్ రెడ్డి శ్రీని వాసరావు, కేప్రసాద్, బలగ శంకరరావు, పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కి భారతరత్న ఇవ్వాలి

పార్వతీపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ పద్మశ్రీ నందమూరి తారక రామా రావుకు భారత రత్న పురస్కా రాన్ని ప్రకటిం చాలని నందమూరి తారక రామా రావు అభిమానులు బుధవారం డిమాండ్ చేశారు. 27వవర్ధంతి సందర్భంగా పార్వతీపురం పట్టణ నందమూరి సేవా సంఘం అధ్యక్షులు యడ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధ్యక్షులు మజ్జి కృష్ణారావు, కౌన్సిలర్ కోరాడ నారాయణరావుల ఆధ్వర్యంలో పట్టణ పాత బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాలలు వేసి ఎన్టీఆర్ కీర్తిని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రెశిడెంట్ తోటనాగరాజు, కార్యదర్సిలు బూర్లి వెంకటేశ్ మక్కువ కిషోర్ రౌతు చిన్నారావు,వంగపండు వంశీ,వై.శ్రీను, పాకల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రదాత : సంధ్యారాణి

సాలూరు రూరల్: నందమూరి తారక రామారావు వర్ధంతిని శివరాంపురం, జీగిరాం గ్రామాలలో మండలపార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇంఛార్జ్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి.సంధ్యారాణి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముందుగా తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చిన ఘనత సాధించారన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం, మద్యపాన నిషేదం లాంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ తో కలసి జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు ఇస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వారితో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతి రావు,నాయకులు మత్స శ్యామ్, అక్కాన తిరుపతి, కరిబుగత. భాస్కరరావు, కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్ర మైన పాచి పెంట మీ సేవ కూడలి వద్ద బుధవారం టీడీపీ మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 300 మంది నిరుపేదలకు మరియు వృద్ధు మహిళలకు రగ్గులు మరియు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ పిన్నింటి ఈశ్వరరావు, పాచిపెంట్ ఉప సర్పంచ్ వెంకటరమణ మాజీ జిల్లా పరిషత్ సభ్యురాలు మంచాల పారమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎక్కుడు శివ, కొత్తల పోలి నాయుడు, కనకల సూర్య నారాయణ, సన్యాసిరావు, షేక్ సుభాని మరియు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండల కేంద్రంలోని కొమ్మినేని కిషోర్ కుమార్ ఇంటివద్ద ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ అమలు చేసిన సంక్షేమ పలు పథకాలు, ఆయన పరిపాలన తదితర అంశాలను నేతలంతా స్మరించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాల్, సాలహరి, పెదబోగీలి, రామవరం,తామరఖండి, చెల్లంనాయుడు వలస సర్పంచులు తేరేజమ్మ గరికయ్య పెంట సత్యం నాయుడు, మూడడ్ల వెంకటనాయుడు, వాకాడ పారినాయుడు, నాయకులు నాగభూషణరావు, సూర్యనారాయణ, భాస్కరరావు, రామకృష్ణ నాయుడు, బుడితి శ్రీను, సబ్బన శ్రీను, వెంకట నాయుడు, రెడ్డి సింహాచలం, పెంట సురేష్, లక్ష్మణ, గుంపస్వామి, శంకరరావు, యోగేశ్వర రావు, బీమశంకర్, సాయి సతీశ్ పాల్గొన్నారు. లచ్చయ్యపేట గ్రామంలో ప్రగతిశీల అధ్యక్షుడు బత్తుల శ్రీరాములు నాయుడు అధ్వర్యంలో ఎన్టీఆర్ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బలిజిపేటలో జరిగిన కార్యక్రమం లో మండల టీడీపీ అధ్యక్షులు పెంకి వేణు గోపాలనాయుడు, టీడీపి నియోజక వర్గ సీనియర్ నాయకులు వాదాడ రాము మండల నాయకులు పాల్గొన్నారు.

సీతంపేట: బడుగు బలహీన వర్గా లకు ఆరాధ్య దైవం దివంగత నేత మహానుభావుడు నంద మూరి తారక రామారావు అని నారీశక్తి అవార్డు గ్రహీత, టిడిపి నాయకురాలు పడాల భూదేవి అన్నారు. ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం సీతంపేట క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తారకరాముడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధ మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, మహిళా నేతలు, స్థానిక నాయకులు హాజరయ్యారు.

ధాన్యం కల్లాల్లో ఏనుగుల బీభత్సం

విశాలాంధ్ర-భామిని: బాలేర్ గ్రామంలో ఏనుగుల గుంపు భీభత్సం తో రైతులకు తీవ్రంగా నష్టపరిచాయి. మండలంలో వంశధార నదీ పరివాహక ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తూన్న గుంపు మంగళవారం కల్లలో ఉన్న ధాన్యం పంటలను నాశనం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగించాయి. రెండు రోజుల క్రితం తాలాడ గ్రామ సమీపంలో సంచరిస్తూ రైతు గౌరుసెట్టి చిన్నారావు పై దాడి చేయగా మృతి చెందిన ఘటన విదితమే. బత్తిలి అలికాం రహదారి పై ఏనుగుల సంచరించడంతో వాహనదారులు, ప్రజలు భయపడుతున్నారు. ఈ మేరకు వాహన దారులు, రైతులంతా ఏనుగుల గుంపు సంచారంతో అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు కోరారు..

జిల్లా రవాణా అధికారిగా మల్లిఖార్జున రెడ్డి

విశాలాంధ్ర -పార్వతీపురం: జిల్లా రవాణా అధికారిగా సి.మల్లి ఖార్జున రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా నుండి పార్వతీపురం మన్యం జిల్లాకు వచ్చారు. మల్లిఖార్జునరెడ్డి గతంలో నెల్లూరు, రాయల సీమ, పశ్చిమ గోదావరి తదితర జిల్లాలలో వివిధ హోదాలలో పని చేశారు. జిల్లా రవాణా అధికారిగా బాధ్యతలు చేపట్టిన సి.మల్లి ఖార్జు నరెడ్డికి ఇన్‌ఛార్జ్ జిల్లా రవాణా అధికారిగా పనిచేసిన ఎం.శశి కుమార్, కార్యాలయ పరిపాలన అధికారి సీతారాం, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

టీకాలు క్రమం తప్పకుండా వేయాలి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : చిన్నపిల్లల్లో సార్వత్రిక టీకాలను నిర్ణీత సమయానికి క్రమం తప్పకుండా వైద్య సిబ్బంది వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. బుధవారం మండలంలో నర్సిపురం గ్రామాన్ని ఆయన సందర్శించి వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. టీకా గడువు తేదీల షెడ్యూల్ నిర్వహణకు సంబంధించిన టిక్లర్ బ్యాగ్‌ను పరిశీలించి ఈ రోజు అర్హుల జాబితా ను, టీకా నిర్వహణ రికార్డులను, కార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అదేవిధంగా ఈరోజు ఎఫ్ఐపివి మూడవ డోసు కు అర్హులైన పిల్లలకు టీకా వేయడాన్ని డిఐఒ.జగన్మోహన్ పరిశీలించారు. పిల్లల్లో సాధారణంగా వచ్చే శ్వాసకోశ సంబంధమైన అనారోగ్య లక్షణాలపై డిఐఒ జగన్మోహన్ అవగాహన కల్పించి, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర-మక్కువ: మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ విద్యుత్ సబ్ స్టేషను, మావుడి విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో ఉన్న గ్రామాలకు శంబర పండగ నిమిత్తం సబ్‌స్టేషను మరమ్మతులు, ట్రీ కటింగ్ వర్కు కారణంగా ఈ నెల 19, 20 తేదీల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 2 గంటలవరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.హరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం



విశాలాంధ్ర-బెలగాం: మద్యం సేవిస్తే తల్లి మందలిస్తుందని యువ కుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం డోకిశీల గ్రామానికి చెందిన రవడాపు పోలీసు కూలి పనిచేస్తూ ఉంటాడు. త్రాగుడు అలవాటు ఉంది. ఈవిషయంమై అతని తల్లి ఎప్పుడూ మందలిస్తూ ఉంటుంది. ఇంకా వివాహం కాలేదు. ఆ క్రమంలో బుధవారం కూడా మద్యం సేవించి ఇంటికి రావడంతో తల్లి మందలిస్తాదని, బాధపెడుతుందని ఇంట్లో ఉన్న చీమల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే త్రాగిన మందును కక్కించి 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

20వ తేదీ లోగా గృహ సారథులు నియామకం పూర్తి చేయాలి

వైసీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విజయనగరం : ఈనెల 20వ తారీకు లోపు గృహ సారథుల నియమకాన్ని పూర్తి చేసి జాబితాను జిల్లా, కేంద్ర కార్యాలయానికి పంపించవలసిందిగా వైసిపిజిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని జగన్నాథ కన్వెన్షన్ హాల్లో బుధవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల జేసీయస్ (జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు) మండల కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా జే సీ యస్ మండల ఇన్చార్జిలుగా నియమితులైన వారందరినీ ఆయన అభినందించారు. వారికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల జే సీ యస్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులుశత్రుచర్ల పరీక్షిత్ రాజు, శాసనసభ ఉపసభాపతి శ్రీ కోలగట్ల వీరభద్ర స్వామి, విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎం.ఎల్.ఎ శబంగి వెంకట చినప్పలనాయుడు , గజపతినగరం ఎం.ఎల్.ఎ బొత్స అప్పలనరసయ్య,నెల్లిమర్ల ఎం.ఎల్.ఎ బడుకొండ అప్పలనాయుడు, రాజాం ఎం.ఎల్.ఎ కంబాల జోగులు గారు కురుపాం ఎం.ఎల్.ఎ శ్రీమతి పాముల పుష్ప శ్రీవాణి, పాలకొండ ఎం.ఎల్.ఎ శ్రీమతి విశ్వసరాయ కళావతి, పార్వతీపురం ఎం.ఎల్.ఎ అలజంగి జోగారావు, శాసనమండలి సభ్యులు డా.సురేష్ బాబు,పాలవలస విక్రాంత్, నియోజక వర్గాల పరిశీలకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రూ.6 వేల 95 కోట్లతో నాబార్డ్ రుణ ప్రణాళిక విడుదల

విశాలాంధ్ర - విజయనగరం : నాబార్డ్ ద్వారా వ్యవసాయానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. నాబార్డ్ 2023 -24 ఆర్థిక సంవత్సరానికి 6 వేల 95 కోట్ల రూపాయలతో రూపొందించిన రుణ ప్రణాళికను సంయుక్త కలెక్టర్ ఆవిష్క రించారు. బుధవారం ఎల్.డి.ఎం శ్రీనివాస రావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరం లో బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాబార్డ్ రుణ ప్రణాళిక లో వ్యవసాయ రుణాలు, వ్యవసాయ ఉత్పత్తులు, నిర్వహణ, మార్కెటింగ్, జల వనరులు, వేస్ట్ ల్యాండ్ డెవలప్మెంట్, పశు సంవర్ధకం, డైరీ , పౌల్ట్రీ, షీప్, గోట్ మత్స్య సంబంధిత రంగాలకు రూ. 3, 685 కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. మిగిలిన నిధులు వ్యవసాయ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వాటర్ షెడ్ డెవలప్మెంట్, సాయిల్ కన్సర్వేషన్, ఇంధన వనరులు, విద్య, హౌసింగ్ సోషల్ ఇన్ఫ్రా , ఎం.ఎస్.ఎం.ఈ వర్కింగ్ కాపిటల్ తదితర రంగాలకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ రుణ పరపతి పై అవగాహన కలిగించుకొని, సంబంధిత లబ్దిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు.

ఈ ఏడాది గ్రౌన్డింగ్ జరిగిన పదకాలన్నీ ఈ మార్చి నెలాఖరు లోగా మంజూరు చేసి నగదు బట్వాడా జరగాలన్నారు. ఉద్యాన వన శాఖ, మత్స్య శాఖ, డి.ఆర్.డి.ఏ, వ్యవసాయ, హౌసింగ్ కు సంబంధించిన పధకాల కోసం మంజూరైన నిధులన్నీ వెంటనే లబ్ది దారుల ఖాతాలలో పడేలా చూడాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఈ ఏడాది చిరు ధాన్యాల సంవత్సరంగా పరిగణిస్తున్నందున చిరు ధాన్యాల సాగును ప్రోత హించాలని, వర్క్ షాప్ల ద్వారా అవగా హన కలిగించి, అందుకు తగు శిక్షణలు ఇవ్వాలని, చిరుధన్యాలను పండిస్తున్న రైతుల విజయ గాధలను వివరించాలని ఉద్యాన శాఖ డి.డి. జమదగ్నికి సూచించారు. ఈ క్రాప్ డేటా ను పంట వారీగా, రైతు వారీగా నమోదు చేసి అర్హత మేరకు పంట రుణాలను విరివిగా అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారి త్రినాధ స్వామి కి సూచించారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న తోడు 5వ విడత దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెంటనే చెల్లించాలని, తర్వాత 6వ విడత దరఖాస్తులను గ్రౌన్డింగ్ చేయాలనీ బ్యాంకు అధికారులకు తెలిపారు. ఈ అంశం పై బ్యాంకు అధికారులు క్రియా శీలకంగా వ్యవహరించి, ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదే విధంగా గృహాలకు సంబంధించి రుణాలను ఎలాంటి పెండింగ్ లేకుండా మంజూరు చేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత పై మండల స్థాయి లో ఏ.పి.ఎం లు, స్థానిక బ్యాంకు అధికారులు కలసి అవగాహన కలిగించాలన్నారు. ఆ మేరకు డి.ఆర్.డి.ఏ పి.డి సర్కులర్ జరీ చేయాలనీ సూచించారు. యువత కు స్వయం ఉపాధి అవకాశాలను వివరించడానికి కళాశాలల్లో స్కిల్ డెవలప్మెంట్ శాఖ ఆధ్వర్యం లో అవగాహనా తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశం లో నాబార్డ్ డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున, రిజర్వు బ్యాంకు ప్రతినిధులు, జిల్లాలోని అన్ని బ్యాంకు లకు చెందిన అధికారులు, జిల్లా అధికారులు డి.ఆర్.డి.ఏ, మెప్మ పి.డిలు కళ్యాణ చక్రవర్తి, సుధాకర రావు, పశు సంవర్ధక శాఖ జే.డి. డా. రమణ, మత్స్య శాఖ డి.డి. నిర్మలా కుమారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీలలో సూపర్ 60 ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నేటి నుండి గత సంవత్సరం వినూత్నంగా కేజీబీవీ లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు సూపర్ 60 ప్రారంభిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథక అధికారి డాక్టర్ విములి స్వామి నాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సూపర్ 60 జామి, విజయనగరం, బొబ్బిలి కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం వలె ప్రస్తుత సంవత్సరం కూడా రాష్ట్రవ్యాప్త మొదటి స్థానానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు 2021-22 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాలలో అన్ని కేజీబీవీ వల్ల కంటే రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానం సాధించడం అభినందన దగ్గర విషయం అన్నారు. ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే ప్రిన్సిపాల్ సూచించామన్నారు. అన్ని కేజీబీవీ లలో విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని బట్టి సూపర్ 60 కి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇదే తరహాలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని కేజీబీవీ లలో విద్యా ప్రమాణాలను అమలు చేస్తామన్నారు. అకాడమిక్ పరంగా, క్లాసుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా చూసేందుకు ప్రయత్నం చేస్తున్నా మన్నారు. గత సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీ లో విద్యార్థులకు అత్యధిక మార్కులు తీసుకువచ్చేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు విద్యార్థులకు సబ్జెక్టు వారీగా ప్రతిరోజు పరీక్షలు నిర్వహించి వారి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు . కేజీబీవీలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటున్నామన్నారు.

బొడ్డగూడ సందర్శించిన ట్రై పాడ్ బృందం

విశాలాంధ్ర - భామిని : పి.వి.టి.జి (సవర) గిరిజనుల జీవన విధానం, అభివృద్ధి పై ట్రైపాడ్ బృందం బుధవారం పర్యటించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రీజియనల్ మేనేజర్ భోళాశంకర్ బృందం గిరిజనుల జీవన స్థితిగతులు, అభివృద్ధి అంశాలు, జీవనోపాధి, వ్యవసాయం, కొండ పోడు పంటల సాగు వివరాలు సేకరించి గ్రామం లోని మౌలిక వసతులు, ఇల్లు, రేషన్ కార్డ్, ఆరోగ్యం, వన్ ధన్ వికాసకేంద్రం పనితీరు తదితర అంశాల పై సచివాలయం వద్ద సమావేశమై గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లో లో నేరుగా గ్రామాన్ని సంద్శించి అటవీ ఉత్పత్తులు సేకరణ అమ్మకాలు ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.వో రోసిరెడ్డి , కామేష్ ప్రధానోపాధ్యాయులు బిడ్డిక రవి, డాక్టర్ ఎన్ ఫణికుమర్ వెలుగు రామారావు పకీరు గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

విశాలాంధ్ర - భామిని : గిరిజన గ్రామాల్లో జీవన స్థితగతులపై కేంద్ర బృందం పర్యటన. సీతంపేట, ఐటిడిఎ పరిధిలోగా పీవీటీజీల జీవన స్థితిగతులపై మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ ఆదేశాల మేరకు కేంద్ర బృందం నేరుగా ట్రైపాడ్ మేనేజర్ బోళ శంకర్ కేంద్ర బృందం బుధవారం బొడ్డగూడ గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని గిరిజనులతో మాట్లాడి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ద్వారా పొందిన పథకాల వల్ల ఎంతమేర లబ్ది పొందారో, పథకాలు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయి వంటి వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో గిరిజనులకు అందుతున్న వైద్య సేవలు, మాతా శిశు మరణాలు గూర్చి వివరాలు తెలుసుకున్నారు. సీసీడీపీ పథకాలు పొందిన లబ్దిదారులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కోసంగిగూడ గ్రామంలోని వీడీవీకే కేంద్రంలోని చీపుర్లు, పసుపు యూనిట్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరుశురాం, ఐటిడిఎ ఏపీవో రోసిరెడ్డి, భామిని పీహెచ్ సీ వైద్యాధికారులు ఫణి కుమార్, సోయల్, పీవీటీజీ కో ఆర్డినేటర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు సర్పంచ్ వితరణ

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ ముందు సంభవించిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన ఏడు బాధిత కుటుంబాల వారికి పెదభోగీలి సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మగరికయ్యలు స్టీల్ సామాగ్రిని, చీరలను బుద వారం అందజేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాల నాయుడు, సాలాహరి, పెంట సత్యం నాయుడు, మూడడ్ల వెంకటనాయుడు, వాకాడ పారినాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధనరెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖామంత్రి కాకాని గోవర్ధనరెడ్డిని మర్యాద పూర్వకముగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం కలిశారు. ఈ సందర్భముగా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు సంబంధించి పలు విషయాలను మంత్రితో చర్చించారు. ముందుగా మంత్రి గోవర్ధనరెడ్డికి శాలువా కప్పి ఎమ్మెల్సీ సత్కరించారు.

ఉపాధి పనులు రెండు పూటలు చేయాలి

విశాలాంధ్ర - రేగిడి : సాగునీటి కాలువల్లో ఉపాధి పనులు సక్రమంగా జరగాలని ఏపీఓ ఎస్.హరనాథరావు వేతనదారులకు సూచించారు. మండలంలో చిన్నశిర్లాం గ్రామం వద్ద తోటపల్లి పిల్లకాలువలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. రెండు పూటలు పని చేయాలని, నిర్దేశిత కొలతల మేరకు పనులు పూర్తి చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని సూచించారు. ఆయన వెంట టీఏ రాంబాబు, ఎఫ్ఎ చిరంజీవి తదితరులు ఉన్నారు.

భూరీసర్వేలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూరీసర్వేలో అక్రమాలు జరిగాయని, అక్రమాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బొబ్బిలి సీపీఎం కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో భూ రీసర్వేలో అక్రమాలు జరగడంతో పేద రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. రామభద్రపురం మండలం గొల్లలపేటలో సర్వే నెంబర్ 210లో 12.30 ఎకరాల భూమిని ఏళ్ల తరబడి పేద రైతులు సాగు చేస్తే సాగు చేసే రైతులకు భూమి రాయకుండా అనర్హులకు భూమి రాసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బినామీ పేర్లను ఆన్లైన్ చేశారని ఆరోపించారు. బొబ్బిలి మండలం గొర్లె సీతారాంపురం రెవెన్యూలో 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటే పేదలకు రాయకుండా అనర్హులు పేరు మీద ఆన్లైన్ చేశారన్నారు. రామభద్రపురం మండలం కొండ కెంగువ రెవెన్యూలో ఐదు ఎకరాల భూమిని అనర్హులకు రాస్తే ఆర్డీఓకు ఫిర్యాదు చేయగా అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చా రని చెప్పారు. కొండకెంగువ రెవెన్యూలో 200 కుటుంబాలు ప్రభుత్వ భూమి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాయని, వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా భూరీసర్వేలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వకుండా పెద్దలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అభివృద్ధి శూన్యమన్నారు. పేదలకు భూమి ఇచ్చి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, బి.శ్రీనివాసరావు ఉన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్

విశాలాంధ్ర - గజపతినగరం : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గజపతినగరం లోని ఎన్టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు జాతీయ రహదారి పక్కన గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ చేసిన కృషిని వివరించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మీ నాయుడు బండపల్లి మండల పార్టీ అధ్యక్షులు కోరాడ కృష్ణ గంట్యాడ మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు పార్టీ నాయకులు వివి ప్రదీప్ కుమార్ అరుణ బొద్దు ఉమా మహేశ్వరరావు మాజీ జెడ్పిటిసి బండారు బాలాజీ తెలుగు యువత అధ్యక్షులు వేమలి చైతన్య బాబు పాల్గొన్నారు

ఘనంగా రుద్రరాజు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు జన్మదిన వేడుకలను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ గిడుగు రుద్రరాజు నాయకత్వంలో రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం అవుతుందన్నారు. ఇప్పటికే గ్రామస్థాయిలో సైతం కమిటీలను వేయడం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో గిడుగు రుద్రరాజు నేతృత్వంలో రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ శ్రీనివాసరావు, షరీఫ్, రెహమాన్, చిలక రాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైజింగ్ డే

విశాలాంధ్ర - విజయనగరం : కోరుకొండ సైనిక్ స్కూల్ 61వ స్కూల్ రైజింగ్ డేను పివిజి రాజు ఆడిటోరియంలో బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా అసెంబ్లీలో క్యాడెట్ బి గగన్ మనోజ్ , క్యాడెట్ కార్తీక్ పూనియా , క్యాడెట్ రూపేష్ రోనంకి 10 నుండి 12వ తరగతుల విద్యార్థులకు సంస్థ యొక్క ప్రారంభ విశేషాలతో పాటు ఇప్పటి వరకు సాధించిన విజయాలను వివరించారు. త్రివిధ సాయుధ సేవల్లోని ప్రముఖ సైకోరియన్లను గుర్తు చేసుకున్నారు. శిక్షణకు సంబంధించిన అన్ని రంగాల్లో సంస్థ ఎలా అత్యుత్తమ పనితీరు కనబరుస్తోందో వారు తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్, కల్నల్ అరుణ్ ఎం కులకర్ణి, సంస్థ ఎలా ఉనికిలోకి వచ్చిందో ఎన్డిఎ ఎంట్రీలలోని అన్ని సైనిక్ స్కూల్స్లో ముందంజలో ఉన్నదో వివరించడంతో పాటు వివిధ రంగాలలో పూర్వ విద్యార్థుల పాత్రను తెలియజేశారు. ఇంతటి స్థాయిలో పాఠశాలను ప్రారంభించడానికి ఈ భూమిని విరాళంగా అందించిన స్వర్గీయ పివిజి రాజు, రాజకుటుంబానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పూర్వీకులు నిర్దేశించిన బెంచ్మార్క్ను నిలబెట్టుకోవడమే కాకుండా మరింత ఉన్నత శిఖరాలను సాధించేందుకు కృషి చేయాలని ఆయన ప్రస్తుత తరానికి ఉద్బోధించారు.

జేసీఎస్ మండల కన్వీనర్గా గౌరీ శంకర్

విశాలాంధ్ర - డెంకాడ : జగనన్న సచివాలయ కన్వీనర్ గృహ సారధుల కోఆర్డినేటర్గా డెంకాడ మండల కన్వీనర్ గా సారిక గౌరీ శంకర్ నియమితులయ్యారు. ఈ ఎంపిక పట్ల పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు గౌరీ శంకరుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ మాట్లాడుతూ తనపై నమ్మకముతో ఇంతటి పదవీ బాధ్యతలు అప్పగించిన వైసీపీ జిల్లా సారధి మజ్జి శ్రీనివాస్ రావుకి ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

జీవో నెంబర్ 1ని ఉపసంహరించుకోవాలి : గురాన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఉన్న జీవో నెంబర్ 1ను ప్రజాస్వా మ్యవాదులందరూ వ్యతిరే కిస్తున్నారని జనసేన నాయకుడు గురాన అయ్యలు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూరోడ్ షోలు, సభలపై ఆంక్షలు విధిస్తూ జగన్ ప్రభుత్వం తెచ్చిన జీఒ నెంబరు 1ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టే ఇచ్చిందని, ఆ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ జీఒ -1పై ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రతిపక్షనేతలపై కక్షసాధింపు కోసం ఇచ్చే ఇటువంటి జీవోలు న్యాయస్థానాల్లో నిలబడవని సీఎం జగన్ ఇప్పటికైనా గుర్తించి తమ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి అని హితవు పలికారు. శ్రీకాకుళంలో జరిగిన యువశక్తి సభ విజయవంతం కావడంతో అధికార పార్టీ నాయకుల్లో వణుకు పుట్టిందన్నారు...తప్పులు వేలెత్తి చూపేవారిపై బురద చల్లే కార్యక్రమాన్ని అధికార పార్టీ పెద్దలు కొనసాగిస్తు న్నారన్నారు. పెయిడ్ ఆర్టిస్టులతో విమర్శలు చేయిం చడం కరెక్ట్ కాదన్నారు.జనసేన బలం గురించి, పొత్తుల గురించి స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల అవగహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. బలవంతంగా స్కూల్ విద్యార్థులను, డ్వాక్రా మహిళలా సంఘాలను, స్కూల్ బస్సులను, ఆర్టీసీ బస్సులను తరలించకుండా..ఒక సభ పెట్టే దమ్ము కోలగట్ల కు లేదన్నారు. జనసేన పొత్తుల గురించి ఆయనకు అనవసరమన్నారు.పొత్తు వున్నా.లేకపోయినా కోలగట్లని ఇంట్లో కూర్చోబెట్టడం ఖాయ మన్నారు. అలాగే ఉత్తరాంధ్రలో కరువు మండలాలు లేవని, రైతులు సంతోషంగా వున్నారని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రకటించడం ఆశ్చర్యంగా వుందన్నారు..గ్రామాల్లో తిరిగితే రైతులు పడుతున్న కష్టాలు తెలుస్తాయన్నారు. వరి ధాన్యం కొనుగోలు సంక్రమంగా జరగకపోవడంతో రైతులు వరి ధాన్యం కుప్పల వద్దనే పడిగాపులు పడే పరిస్థితి నెలకొందన్నారు. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడు తున్నారన్నారు.. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో అప్పులు తీర్చలేక చాలామంది కూలీలుగా మారుతున్నారన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర - బొబ్బిలి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామా రావు 27వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం పక్కి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల కోసం నందమూరి తారక రామారావు అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. అదే తరహాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి,వేణుగోపాలనాయుడు, సర్పంచ్ గంట పైడిరాజు, ఉప సర్పంచ్ అల్లు రామూర్తి, పంచాయతీ వార్డు మెంబర్లు, వైసీపీ నాయకులు గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ..

బస్సులో దొరికిన పర్సును డిపో మేనేజర్ రమేష్కి అప్పగించిన వైనం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట ఆర్టీసీ డిపోకి చెందిన డ్రైవర్ గంగరాజు అరకు - విశాఖ డీలక్స్ బస్సులో విధులు ముగించుకుని బుధవారం రాత్రి వెళ్తున్న సమయంలో తనకు దొరికిన పర్సును భద్రపరిచి డిపో మేనేజర్ కె.రమేష్ కి గురువారం అప్పగించారు. ఆర్టీసీ డిపో అధికారులు దొరికిన పర్సు గురించి ఆరా తీయగా అరకు తహశీల్దార్ వేణుగోపాల్కి చెందినదిగా గుర్తించారు. ఈ పర్సులో దాదాపుగా రూ.4,700 నగదు, ముఖ్యమైన గవర్నమెంట్ కార్డులు, ఏటీఎం కార్డులు ఉన్నట్లు గుర్తించి తహశీల్దారుకి సమాచారం అందించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ వెల్లడించారు. త్వరలోనే ఈ పర్సును అరకు తహశీల్దారు వేణుగోపాల్కి అందజేయనున్నామని తెలిపారు.

డా. వైయస్ఆర్ కంటి వెలుగు నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర - పార్వతిపురం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నవంబర్ 2020 నుండి నిర్వహిస్తున్న డా. వై యస్ ఆర్ కంటి వెలుగు కార్య క్రమంలో భాగంగా అవ్వ తాత లకు నేత్ర పరీక్షలు గతంలో నిర్వహించినపుడు నేత్ర పరీక్షలు చేయించి కొనని వారికి మాఫ్ అప్ కార్యక్రమం ద్వారా పెద బొండపల్లి సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు బుధవారం రామాలయం ఆవరణలో నేత్ర వైద్య శిభిరం నిర్వహించి నట్లు నేత్ర వైద్య అధికారి డా నగేష్ రెడ్డి తెలిపారు. పెద బొండపల్లి సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలలో వున్న 60 నుండి ఆ పై బడి వయస్సు వారికి నేత్ర పరీక్షలు జరిపి శస్త్ర చికిత్సలు మరియు కళ్ళ జోళు అవసరం అయిన వారికి రిఫరల్ చేసినట్లు గతంలో నేత్ర పరీక్షలు చేసిన వారిలో కళ్ళ జోల్లు అవసరం అని గుర్తించిన వారికి ఉచితంగా కళ్ళ జోళ్లు పంపిణీ చేసినట్లు నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి తెలిపారు.కళ్ల జోళ్ళు పెట్టుకున్న అవ్వ తాతలు తమ కంటి చూపు ఎంతో మెరుగు పడిందని ఆనందం వ్యక్తం చేశారు.ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించి మా లాంటి పేదలకు గ్రామము లోనే కంటి పరీక్షలు నిర్వహించి నందుకు రాష్ట్ర ప్రభుత్వంకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుబ్బ లక్ష్మి ఆశా వర్కర్లు పాల్గొన్నట్లు తెలిపారు.

రెండు వర్గాలతో మేం వేగలేకపోతున్నాం..

మండల నేతలకు తేల్చి చెప్పిన జామి తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర - జామి : తెలుగు దేశం పార్టీకి ప్రాణమిచ్చేవాళ్ళం.. కానీ రెండు వర్గాలుగా ప్రచారాలు చేస్తే మాలాంటి వాళ్లు ఏం చేయగలం. ఇది పద్ధతి కాదు. మీరంతా ఒక నిర్ణయానికి వచ్చి మాకు చెప్పండి. మేం ఈ వర్గాలను తట్టుకోలేకపోతున్నాం.. ఇది జామిలోని తెలుగు యువత తమ్ముళ్ళు అవేదన, ఈవిషయాన్ని బుధవారం మండల నేతలకు నేరుగా చెప్పారు. మీరు ఒక వర్గంగా లేకపోతే మానిర్ణయాన్ని మేం తీసుకోవాల్సి ఉంటుంది అని హెచ్చరించారు. ఎన్టిఆర్ వర్ధంతికి వచ్చిన మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి వర్రి రమణలు ఇద్దరూ కలిసే కార్యక్రమంలో పాల్గొనడం తెలుగు తమ్ముళ్ళలలో ఉత్సాహం నింపింది. ఇలాగే కలిసి పనిచేస్తామని చెప్పాలని, వర్గాల వారీగా ప్రచారాలు చేయడంతో అందకూ నవ్వుతున్నారని యువకులు తెలిపారు. దీనిపై వచ్చే ఆదివారం జామిలో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని గ్రామ కమిటీ అధ్యక్షుడు వేంద్రపు నాయుడు బాబు తెలిపారు. ఈసమావేశంలో యువకులకు తగిన నిర్ణయాన్ని తెలియజేయడంతోపాటు, పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. దీంతో యవకులు కొంత వరకు శాంతించారు. ఆదివారం నేతల నిర్ణయంకోసం ఎదురు చూస్తామన్నారు.

సేవలతోనే ముందుకు : రోటరీ అధ్యక్షులు పీహెచ్ఎఫ్ రాజు

విశాలాంధ్ర - బొబ్బిలి : ప్రజలకు అవసరమైన సేవలు అందించటం తోనే రోటరీ సంస్థ ముందుకు వెళ్తున్నదని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు అన్నారు బుధవారం స్థానిక శ్రీ సూర్య మినీ సమావేశ మందిరంలో రోటరీ క్లబ్ డైరెక్టర్స్ సమావేశం కార్యదర్శి శ్రీ హరి నిర్వహించారు. ఈ సమావేశంలో పీహెచ్ఎఫ్ జెసి రాజు మాట్లాడుతూ రోటరీ చేస్తున్న సేవాకార్యక్రమాలను ప్రజలకు మరెంత చేరువ చేయాలని, సభ్యులు సహకారం అందించాలని కోరారు. ఫిబ్రవరి నెలలో రోటరీ ఆధ్వర్యంలో టైలరింగ్ నేర్చుకొన్న అర్హులైన 110 మంది పేదలకు మోటార్తో కూడిన కుట్టు మిషనులను పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం కళాభారతి వద్ద బస్ షెల్టర్ను నిర్మిస్తామని అన్నారు. అదే విధంగా బాలికలు, మహిళలకు అవసరమైన మరుగుదొడ్ల కాలేజి రోడ్లో నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశామని అందుకు అవసరమైన అనుమతులు రాగానే టాయిలెట్స్ నిర్మాణం చేస్తామన్నారు. రోటరీ జిల్లా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్సు ఈ నెల 28, 29వ తేదీలలో మంజీర ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహిస్తున్నారని, ఈ కాన్ఫరెన్స్ ప్రముఖ ప్లే బ్యాక్ సింగెర్స్ శ్రీ రామ చంద్ర, రమ్య బెహేరా, లిప్సిక హాజరవుతారని అన్నారు. గెస్ట్ స్పీకర్స్ గా తనికెళ్ళ భరణి, ఎం.రాఘవేంద్ర హాజరవుతారని అన్నారు. రొటేరిన్స్ అందరూ తప్పక కాన్ఫెరెన్సు కు రిజిస్ట్రేషన్ అవ్వాలని కోరారు. సమావేశంలో రోటరీ విభాగాల డైరెక్టర్స్ చంద్ర కిషోర్, జి .శ్రీనివాసరావు కె.రామకృష్ణ, పి.కృష్ణ మోహన్, జి.శంకరరావు. డేవిడ్ జె.విక్టర్ కె.నాగరాజులు పాల్గొన్నారు.

పంట కాలువను ఆక్రమించి ఇంటి పునాదులు నిర్మాణం

తహశీల్దారుకి ఫిర్యాదు చేసిన రైతులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మండలం, మామిడిపల్లి రెవెన్యూ పరిధిలో ధర్మవరం గ్రామ శివారున వైఎస్సార్ కాలనీలో ఒక లబ్దిదారుడు తనకు మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని మించి పంట కాలువలో పునాదులు నిర్మాణం చేయడం వలన పక్కన ఉన్న భూములకు చెరువు నీరు అందని పరిస్థితి వస్తుందని రైతులు వాపోతున్నారు. అలాగే భూములకు వెళ్లే దారి కూడా మూసుకుపోయినట్టవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల తహశీల్దార్ డి.శ్రీనివాసరావుని రైతులు బుధవారం కలిసి పంట కాలువ ఆక్రమణ పట్ల ఫిర్యాదు చేశారు. కాలువ భూమిని ఆక్రమించి ఇంటి పునాదుల నిర్మాణం పట్ల వెంటనే గ్రామ వీఆర్వోని పంపి విచారణ జరిపించి రైతులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ స్పష్టం చేశారు. అలాగే పంట కాలువ స్థలంలో విద్యుత్ స్తంభాలు వేయటం పట్ల కూడా రైతులు సంబంధిత ఏఈకి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే వేసిన స్తంభాలను పరిశీలించి వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని ఏఈ వెల్లడించారు.

18 నుంచి రహదారి భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ వారి ఆదేశాలనను సరించి జనవరి 18వ నుండి 24 తేది వరకు నిర్వహిస్తున్న రహదారి భద్రతా వారోత్సవాలను సంయుక్త కలెక్టరు ఒ.ఆనంద్ బుధవారం కలెక్టరు కార్యాలయంలో లాంచనంగా ప్రారంభించారు. ఈ సంధర్భంగా రహదారి భద్రతపై పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి. ఒ.కిరణ్దిలీప్, రీజనల్ ట్రాన్స్పోర్ట్ అధికారి సి. మల్లిఖార్జునరెడ్డి, ప్రజారవాణా శాఖ సహాయ మేనేజరు, బి.సంజీవరావు, టౌన్ పోలీసు స్టేషను ఎ.ఎస్.ఐ. ఎల్. శ్రీనివాసరావు మరియు యితర పోలీసు,రవాణా అధికారులు హాజరైనారు.

21న వాహనాల వేలం

విశాలాంధ్ర - బొబ్బిలి : ఈనెల 21న శనివారం బొబ్బిలి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ నందు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయుటకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసారని, ఈ వేలంపాట విజయనగరం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ శైలజా రాణి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.